## సింగిల్ పేజీ కథలు

# షరతు

"సరితా! ఇవాళ ఆఫీసు నుంచి తొందరగా రావాలి నువ్వు. పర్మిషన్ పెట్టి నాలుగుకల్లా వచ్చేయ్" అంది.సరిత తల్లి శారదమ్మ.

"ఎందుకమ్మా" అని అడగలేదు సరిత. ఆమెకి తెలుసు, తన పెళ్లిచూపులు ఏర్పాటుచేస్తేనే ఆమె అలా అంటుందని. ఆమెకి ఈ పెళ్లిచూపుల తంతు అస్సలు యిష్టం లేదు. అయినా తల్లిదండ్రుల సంతృప్తి కోసం ఒప్పుకోక తప్పదామెకు. సరిత అందమైనదే కాక, మంచి జీతం వచ్చే ఓ ప్రభుత్వరంగ సంస్థలో ఉద్యోగస్థురాలు. అయినా, తన పెళ్లి చూపులలో కట్నం గురించి జరిగే బేరసారాలతో విసుగెత్తి కట్నం పుచ్చుకొనేవాణ్ణి పెళ్లి చేసుకోనని గట్టి నిర్ణయం తీసుకొంది. అంతేకాక, కట్నం యిచ్చి పెళ్లి చేసుకున్న తన స్నేహితురాళ్ల అవస్థలనూ, యింకా ఎక్కువ కట్న కానుకల కోసం వేధించే వాళ్ల భర్త, అత్తమామల గురించి తెలుసుకొని తన నిర్ణయం యింకా దృఢతరం చేసుకుంది.

అందుకే పెళ్లిచూపులు ఏర్పాటైనప్పుడల్లా, ఆమె తన షరతుల్ని వినిపిస్తుంది. అందులో ముఖ్యమైనది, కట్నం ప్రసక్తి ఉండకూడదనేది. చాలా సంబంధాలు ఈ ఒక్క అంశంపైన తప్పిపోయేవి. ఒకవేళ ఎవరైనా ఆమె ఉద్యోగం చూసి, షరతును ఒప్పుకుంటే తన తర్వాతి షరతు ఆమె చెప్తుంది. అదేమంటే పెళ్లైన తర్వాత తను ఉద్యోగం మానేస్తుందనేది. దాంతో మిగతా సంబంధాలు కూడా తప్పిపోయేవి. అయితే పెళ్లైన తర్వాత ఉద్యోగం మానాలన్న ఉద్దేశం ఆమెకేమాత్రం లేదు, కేవలం వాళ్ళ అంతరంగం తెలుసుకోవడమే ఆమె ప్రయత్నం.

తల్లి శారదమ్మ, తండ్రి రామారావు కట్నం లేకుండా ఆడపిల్ల పెళ్లి జరగడం కష్టమని, మంచి సంబంధం చూసి ఆమెని ఒప్పుకోమని బతిమిలాడినా ఆమె తన పట్టుదల వీడలేదు. ఈ విషయంలో ఆమె మామయ్య రాఘవ ఆమెకి పూర్తి సపోర్టు మరి! తన ఆదర్శం మీదే నిలబడాలనేది ఆమె మనస్తత్వం. అందుకే ఈమధ్య చాలారోజులయింది పెళ్లి సంబంధాలు వచ్చి.


"పెళ్లికొడుకు యింజనీరుగా ప్రభుత్వ సంస్థలో మంచి ఉద్యోగం చేస్తున్నాడు. పైగా వాళ్లు కట్నం కూడా వద్దన్నారు" అంది శారదమ్మ.

"కట్నం లేకపోతే ఏమైంది? నా ఉద్యోగం ఉందిగా!" అంది సరిత వెటకారంగా.

"లేదు! వాళ్లు అలాంటివాళ్లు కాదని మీ మామయ్య చెప్పాడు. వాడే ఈ పెళ్లి సంబంధం తెచ్చాడు" అంటున్న ఆమె మాటల్ని పెద్దగా పట్టించుకోకుండా ఆఫీసుకి బయలుదేరింది సరిత.

ఆ సాయంకాలం తనకి యిష్టం లేకపోయినా సాదాసీదాగా తయారైంది సరిత పెళ్లి చూపుల కోసం. ఆరుగంటలయ్యేసరికి సరిత మామయ్య రాఘవతో వచ్చిన పెళ్లి వారిని సరిత తండ్రి రామారావు ఆహ్వానించాడు.

రాఘవ లోపలికి వచ్చి సరితని చూసి, "అమ్మా సరితా! ఇది చాలా మంచి సంబంధం. నువ్వు కోరుకున్న లక్షణాలన్నీ అతనిలో ఉన్నాయి. మంచి ఉద్యోగం. అతని తల్లిదండ్రులు కూడా చాలా మంచివాళ్లు. పెళ్లికొడుకు కిరణ్ నిన్ను తన స్నేహితుడి పెళ్లిలో చూసి యిష్టపడ్డాడు కూడాను. నువ్వు ఒప్పుకోవడమే తరువాయి!" అన్నాడు.



"ఈ సంబంధం ఖాయం అవ్వాలని వేయిదేవుళ్లకు మొక్కుకున్నాను. ఇది నిశ్చయమైతే తిరుపతికి వెళ్లి వస్తామని మొక్కుకున్నాను. దేవుడి దయవల్ల ఇది కుదిరితే బాగుణ్ణు" అని అంది శారదమ్మ.

"తప్పకుండా అవుతుంది. నువ్వు బెంగేమీ పెట్టుకోకు" అన్నాడు రాఘవ అక్కయ్యతో.

పరిచయాలయ్యాక, స్వీట్స్ టిఫిన్స్ అందించాక, పెళ్లి చూపుల తంతు మొదలైంది.

సరిత తలెత్తి పెళ్లికొడుకు కిరణ్‌ని చూసింది. అతను హుందాగా, అందంగా ఉన్నాడు. అదే సమయంలో అతను కూడా ఆమెను చూడటంతో యిద్దరి చూపులు ఒక్కక్షణం కలుసుకున్నాయి. అతని రూపం, హుందాతనం ఆమెని ఆకట్టుకున్నాయి.

కాస్సేపయ్యాక అమ్మాయి నచ్చిందని అన్నారు కిరణ్, అతని తల్లిదండ్రులు. అది విని రామారావు, శారదమ్మ చాలా సంతోషించారు. రాఘవ కూడా రిలీఫ్‌గా ఫీలయ్యాడు.

"పెళ్లికొడుకు నచ్చాడా" అన్నట్లు సరిత వైపు చూసిన ఆమె తల్లిదండ్రులకు ఆమె ముఖమే సమాధానం చెప్పింది.

రామారావు ఏదో చెప్పబోయేంతలో కిరణ్ తండ్రి అన్నాడు.

"మేం చెప్పుకోకూడదుగానీ, మా కిరణ్ ఆదర్శవంతమైన యువకుడు. మీ అమ్మాయి షరతులన్నీ మేం యిదివరకే తెలుసుకున్నాం. అన్నిటికీ మాకు అంగీకారమే! మా అబ్బాయికే కాదు మాకు కూడా కట్నం పుచ్చుకోవడం యిష్టం లేదు. మాకు ఆస్తిపాస్తులకు లోటులేదు. కోడలు ఉద్యోగం చెయ్యవలసిన అవసరం కూడా లేదు" అని కొద్దిసేపు ఆగాడు.

"అయితే ఒక్క విషయం!" అన్నాడతను.

అందరూ ఆత్రుతగా, ఆదుర్దాగా చూశారు అతని వైపు.

సరిత కూడా మెల్లగా తలెత్తింది.

కట్నం వద్దంటూనే, ఉద్యోగం మానేసినా ఫర్వాలేదంటూనే యింకేదయినా కండిషన్ పెడతారు కాబోలు అన్నట్లు మామయ్య వైపు చూసిందామె.

రాఘవ కూడా ఉత్కంఠతో చూసాడతని వైపు.

ఇక రామారావు, శారదమ్మ ముఖాల్లో ఆదుర్దా స్పష్టంగా కనిపిస్తోంది.

"అయితే ఒకే ఒక షరతు మాది! ఏమిటంటే యివాళ, రేపు కట్నం తీసుకోవడం ఓ సంప్రదాయం, రివాజు అవడం మాత్రమే కాకుండా ఓ స్టాటస్ సింబల్‌గా మారింది. అంతేకాకుండా పరువు ప్రతిష్ఠలకి సంబంధించినదిగా ఎన్నుకోబడుతోంది. ఈ రోజుల్లో ఎవరు ఎంత ఎక్కువ కట్నం పుచ్చుకుంటే అంత గొప్ప. బంధువర్గాల్లో స్నేహితుల్లో కట్నం అంతస్థుకి సంబంధించినదిగా తయారైంది. అందుకోసం మేము కట్నం ఏమీ ఆశించకపోయినా, అయిదు లక్షలు కట్నం తీసుకున్నట్లు మా బంధుమిత్రులతో చెప్పుకుంటాం. అంతేకాక, మా వాడు ఆఫీస్ లోన్ పెట్టి తేబోయే టివి, ఫ్రిజ్ లాంటి వస్తువులు కూడా మీరు పెళ్లి కానుకలుగా యిచ్చినట్లు చెప్పుకుంటాం. దీనికి మీరు ఒప్పుకోవాలి. ఇదే మా షరతు!"

అవాక్కై వింటున్నారంతా.

రామారావు, శారదమ్మ, రాఘవ- సరిత వైపు చూశారు ఆమెకి ఈ షరతు ఆమోదయోగ్యమైనదా, కాదా అని. వాళ్లకైతే ఎటువంటి అభ్యంతరం లేదు.

ఒక్కక్షణం సరిత ఆలోచనలో పడింది. 'ఈ షరతుకి ఒప్పుకోవాలా లేక, ఈసారి పెళ్లి చూపులకి వచ్చేవాళ్లకి తను విధించబోయే షరతుల్లో కొత్తగా- కట్నం తీసుకోక పోయినా తీసుకున్నట్లు చెప్పడం చేయకూడదని చేర్చాలా' అని ఆలోచిస్తోంది ఆమె.

ఆమె ఆలోచనల్లోంచి బయటపడకుండానే లేచారు మగపెళ్లివారు "ఏ విషయం తెలియపర్చండి" అని.

ఏ నిర్ణయం తీసుకోవాలో అర్థంకాక ఆలోచనలో పడింది సరిత.

**-డి.వి.డి.ప్రసాద్ (వదంపూర్)**

# మూల్యం

**"అమ్మా! నేను బైక్ కొనుక్కుంటాను. రోజూ యూనివర్శిటీకి బస్ మీద వెళ్ళి రావాలంటే ఇబ్బందిగా వుంది. టైమ్ అంతా బస్ కోసం ఎదురు చూడడంతోనే అయిపోతోంది. నా ఫ్రెండ్స్ అంతా ఎప్పుడో పెద్ద బళ్ళు కొనేసుకున్నారు"**

సునీల్ మాటలకి పార్వతికి ఒళ్ళు మండిపోయింది.

"నీకేమైనా మతిపోయిందర్రా! ఈ సంవత్సరమే కదా ఇంజనీరింగ్‌లో చేరావు. అప్పుడే నీకు బైకులు, షోకులు కావాల్సివచ్చాయా? బస్‌లో వెళ్ళి చదవడానికే నీకు అంత కష్టంగా వుంటే, నీ ముందు సముద్రం అంత చదువుంది. అదెలా చదువుతావురా? మీ ఫ్రెండ్స్ తల్లిదండ్రులిద్దరూ వుద్యోగాలు చేస్తున్నారు. వేలకి వేలు సంపాదించుకుంటున్నారు. మన పరిస్థితి ఏమిటో కాస్త ఆలోచించావా? తండ్రి లేని పిల్లాడివి. తల్లి వుద్యోగం చేసి సంపాదిస్తుంటే, కష్టపడి చదువుకోవడం మానేసి జల్సాలు చేస్తావా? అస్సలు బాధ్యత లేకుండా మాట్లాడుతున్నావు?" ఆవేశంతో పార్వతి కంఠంలో చిన్న వణుకు.


సునీల్ చేతిలో వున్న పుస్తకాన్ని పక్కన పెట్టి "నేనేమీ జల్సాల కోసం బండి కొనమన్లేదు. రోజూ రెండు బస్‌లు మారి కాలేజీకి వెళ్ళడం, మళ్ళీ రెండు బస్‌లు మారి యింటికి రావడం. ఉన్న టైమ్ అంతా బస్సులకే అయిపోతే యింక చదువుకోవటం ఎలా? అయినా ఈ వయస్సులో కాకపోతే ముసలివాణ్ణి అయ్యాక బైక్ కొనుక్కోవాలా? బ్యాంక్‌లో నాన్నగారికి వచ్చిన డబ్బుంది కదా! అది వాడితే తప్పేంటి?" రోషంగా అన్నాడు సునీల్.

నిన్నటివరకు ఎంతో మర్యాదగా మాట్లాడిన కొడుకు, బైక్ కొనొద్దన్నందుకే యిలా ఎదురుతిరిగి మాట్లాడేసరికి ఆ తల్లి మనస్సు తట్టుకోలేకపోయింది. కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి.

"నాన్నగారు చనిపోయిన తర్వాత వచ్చిన డబ్బురా అది. తన కొడుకుని పెద్ద వుద్యోగస్థుడిగా చూసుకోవాలని ఆయన ఎన్నో కలలు కన్నారు. అవేమీ తీరకుండానే అర్థాంతరంగా వెళ్ళిపోయిన ఆయన కోరిక తీరాలంటే ఆ డబ్బులో ప్రతీ పైసా నీ చదువుకే వుపయోగించాలని అనుకున్నాను. ఇంట్లో ఎంత అవసరమైనా పనిమనిషిని పెట్టుకోలేదు. గ్రైండర్, ఫ్రిజ్ అంటూ ఏ వస్తువూ కొనుక్కోలేదు. నేను బయటకు వెళ్ళి వుద్యోగం చేస్తున్నా ఏనాడూ ఖరీదైన చీరలు కొనుక్కోలేదు. నీ చదువుకి ఆటంకం అవుతుందని టీవీ కూడా చూడడం మానేసాను. నువ్వు యివన్నీ ఎప్పుడైనా ఆలోచించావా? అయిదారేళ్ళు కష్టపడి చదివితే మంచి వుద్యోగం వస్తుంది. అప్పుడు ఏకంగా కారే కొనుక్కోవచ్చు. ఇప్పుడు మాత్రం నన్నేమీ కొనమనొద్దు."

కళ్లు తుడుచుకుని గబగబా పార్వతి వంటగదిలోకి వెళ్ళిపోయింది.

★ ★ ★



"సినిమాకి వెళ్దామంటే రానంటావు. బీచ్ అంటే వద్దంటావు. పోనీ అలా క్యాంటీన్ వరకు అయినా రారా బాబూ అంటే, ఏమీ మాట్లాడకుండా అలా దిమ్మచెక్కలా కూర్చున్నావేంట్రా, అసలు నీకేమైంది ఈరోజు?" కోపంగా అరిచాడు రమేష్.

"మన సునీల్‌గాడు కొంపదీసి ప్రేమలో పడలేదు కదా! మొన్న మనం చూసిన సినిమాలో హీరో కూడా ప్రేమలో పడినప్పుడు 'మాడిన వంకాయ' మొహం వేసుకుని తిరుగుతూంటాడు. మన వాడి ఫేస్ కూడా అచ్చంగా అలాగే వుంది"

కిరణ్ మాటలకి మిత్ర బృందం అంతా నవ్వుల వర్షం కురిపించారు. సునీల్ రోషంగా "ప్రేమా లేదూ, దోమా లేదు. ఈ పండుగకి మనందరం బైక్‌లు కొనుక్కుందామని అనుకున్నాము కదా! మీ అందరి యిళ్ళల్లో గ్రీన్ సిగ్నల్స్ యిచ్చేసారు. కానీ మా ఇంట్లోనే అమ్మ వద్దంది. ఇప్పుడేం చెయ్యాలో తెలియక నేను బాధపడుతుంటే, మధ్యలో మీ బోడి హాస్యం ఒకటి"

సునీల్ మాటలు విని రమేష్, కిరణ్ ఆలోచనలో పడ్డారు. అయిదు నిమిషాలు గడిచాయి.

"యురేకా! ఒరేయ్ సునీల్, బ్రహ్మాండమైన ఐడియా వచ్చిందిరా! నువ్వు కరెక్ట్‌గా చెయ్యగలిగితే మీ అమ్మగారు నిమిషాల మీద బైక్‌కొని, తాళం చెవులు నీ చేతిలో పెడతారు" అంటూ కిరణ్ తనకొచ్చిన ఐడియాని సునీల్ చెవిలో వూదాడు.

ఒక్కసారి వులిక్కిపడ్డాడు సునీల్. "కిరణ్! రిస్కేమోరా" అన్నాడు భయంగా. చిన్నగా కాళ్లు వణుకుతున్నాయి.

"పిరికివాడిలా మాట్లాడకు. సాహసం చేసినప్పుడే విజయలక్ష్మి వరిస్తుంది. రెండుగంటలు నీ శరీరాన్ని కష్టపెడితే కొత్త బైక్ నీ చేతుల్లో వుంటుంది. టట్టడాం."

కిరణ్ మాటలతో ఆలోచనలో పడ్డాడు సునీల్.

★ ★ ★

హాస్పిటల్ బెడ్ మీద సునీల్ మగతగా పడి వున్నాడు.

"ప్లీజ్ డాక్టర్..ప్లీజ్..వాణ్ణి రక్షించండి. వాడు తప్ప నాకెవరూ లేరు. ఎలాగైనా రక్షించండి. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు" పిచ్చిదానిలా వున్న పార్వతి తన కొడుకుని చూసుకుంటూ, గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది.

"అయాయ్ సారీ అమ్మా! మీ అబ్బాయి తాగింది పవర్‌ఫుల్ పురుగుల మందు. అందుకే తీసుకున్న విషం కొంచెం అయినా ప్రాణం మీదికి వచ్చింది. మా ప్రయత్నం మేము చేస్తాం. తర్వాత మీ అదృష్టం?"

డాక్టర్ మాటలు వింటూనే సునీల్ చేతిని పట్టుకుని "ఒరేయ్ కన్నా! ఎంతపని చేసేవురా! ఈ ప్రపంచంలో నాకు నువ్వు తప్ప ఎవరున్నార్రా? మీ అమ్మకి యింత అన్యాయం చేస్తావా? నా తండ్రివి కదా లేమ్మా! లేరా బాబూ..చూడరా నీ ఫ్రెండ్స్ అంతా వచ్చారు. బైక్ కావాలన్నావు కదూ, తప్పకుండా కొంటాన్రా.. కళ్లు తెరు.. బాబూ సునీల్..కన్నా" ఏడుస్తున్న పార్వతిని వోదార్చటం ఎవరి తరమూ కావడం లేదు.ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మీ అమ్మగారిని బెదిరిస్తే ఆవిడ భయపడి బైక్ కొంటుందని తనిచ్చిన సలహా స్నేహితుడి ప్రాణం మీదికి రావడం చూసి కిరణ్ తలబాదుకుని ఏడుస్తున్నాడు.

సునీల్ మగతలో కలవరిస్తున్నాడు "అమ్మా! యింకెప్పుడూ యిలా చెయ్యనమ్మా! నాకు బైక్ వద్దు. నా జీవితం కావాలి.. అబ్బా.. నేను చచ్చిపోనమ్మా.. బ్రతకాలని వుం..."

మాట ఆగిపోయింది. సునీల్ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఆత్మహత్య అనే ఆయుధాన్ని వుపయోగించి బెదిరించాలని అనుకున్న సునీల్‌కి తన జీవితాన్నే 'మూల్యం'గా చెల్లించాల్సి వచ్చింది.

**-డి.స్వర్ణశైలజ (ఖరగ్‌పూర్)**